# అద్దం

కె. రామలక్ష్మి


అద్దంలో ముఖం చూసుకుంటున్న లక్ష్మికి ఆశ్చర్యం! తన ముఖం కనబడడం లేదు. వయసు మళ్ళిందేమో, దృష్టి కాస్త మసకేసింది. అద్దం దగ్గరగా వంగి చూసుకుంది. అప్పుడూ ముఖం కనబడలేదు. 'కొంపతీసి కళ్ళు పోలేదు కదా?' గొణుక్కుంది.

"ముసలిదానికింకో పని లేదండీ. రోజూ ఆ డొక్కు ముఖం పదిసార్లేనా అద్దంలో చూసుకుంటుంది. ఏముంటుందా ముఖంలో నాకైతే అర్థం అయి చావదు." వినుగ్గా మొగుడుకు ఫిర్యాదు చేసింది జయంతి.

కోడలు విసుగు అర్థం కాకపోలేదు లక్ష్మికి. 'పాల రాతి బొమ్మ. మాట కటువు, మనసు అంతకంటే కటువు. అంతకంటే ఏమంటుందీ! నేనేం చూడాలని ప్రయత్నిస్తున్నానో కొడుక్కే అర్థం కాదు, ఇక కోడలు అర్థం చేసుకోకపోతే బాధపడడం వృథా.' మనసులోనే అనుకుని, అద్దాన్ని చెంగుతో తుడిచి బల్ల మీద గోడకి చేరవేసింది లక్ష్మి. ఆరోగ్యం చెడింది, ఓపిక చచ్చింది. అటూ ఇటూ ఇంట్లో తిరిగితే అందరి కళ్ళకీ అడ్డు తప్పించి ఏం లేదు. గదిలో నాలుగ్గోడల మధ్యా పాత మంచం, పాత పరుపు, ఓ పాత దుప్పటి సొంతం. బల్ల కింద బట్టల పెట్టె, బల్ల మీద అద్దం, దువ్వెన, ఇంకో విసనకర్ర. "అంతసేపు ఫ్యాను దేనికి? కాస్త విసురుకోండి. చేతికి పని. లేకపోతే ఆ చెయ్యి కాస్తా బిగుసుకుపోతుంది. ఇక మంచి నీళ్ళు కూడా నోటికి అందించాల్సి వస్తుంది! అంత ఓపికా, తీరికా ఇక్కడ ఎవరికీ లేదండీ" అంటుంది కోడలు. ఆ మాట జ్ఞాపకం వచ్చినప్పుడల్లా విసనకర్రని మంచంమీదకి తెచ్చుకొంటుంది లక్ష్మి. లేకుంటే 'ఒరీ నానీ, ఆ విసనకర్ర అందివ్వరా' అని మనవణ్ణి పిలవాలి. వాడు నానా గోలా చేసి, కింద పడేసి, మీద పడేసి, మంచం మీదున్న నానమ్మ మీదికి విసరి చక్కా పోతాడని ఆమెకి భయం. ఎవరినీ పల్లెత్తు మాట అనకూడదు, అడక్కూడదు. 'ఓ మూల పడి ఉండక ఎందుకొచ్చిన ఆరాలండీ' అనేస్తుందని భయం. కోడల్ని చూసి మురిసిపోయిన లక్ష్మికిప్పుడు కోడలి కంటపడడానికి భయం. ఆ కళ్ళలో చూపు తీవ్రతంటే భయం. ఆ చూపు ప్రదర్శించే భావాలంటే భయం.

హాల్లో నవ్వులు వినిపిస్తున్నాయి. తలుపు జేరవేసి ఉంది. ఆదివారం కదా ఎవరో వచ్చినట్టుంది. మెల్లిగా లేచి అద్దం అందుకుంది లక్ష్మి. నా ముఖంలో అందం కోసం వెతుక్కోడం లేదే జయంతీ, నా కోసం వెతుక్కుంటున్నాను' అని నెమ్మదిగా కోడలితో అనాలని లక్ష్మి కోరిక. కానీ సాహసించలేకపోయింది. కొడుకు రామం పలకరించడమే అరుదు. 'అమ్మా సంతకం పెట్టు' అని ఒకటో తారీఖున పెన్షన్ కాగితం పట్టుకొస్తాడు. వాడి ముఖంలోకి చూడాలని చూస్తుంది కానీ, అతనికి టైము ఉండదు. పెట్టమన్న చోట క్షణాల మీద సంతకం పెట్టేస్తుంది. 'ఆ పెన్షన్ మీద నాకెంత హక్కుందో వాడికీ అంతే ఉంది. పాపం నేను పోతే అది రాదనీ వాడికి తెలుసు. అందుకే మాసం మాసం ఈ క్రతువు తప్పడం లేదు వాడికి' అని మనసులోనే బాధపడుతుంది.

వీడు పుట్టినప్పుడు చచ్చిపోతుందేమో అనుకున్నారంతా. కానీ గట్టి ప్రాణం. బతకడమే కాదు, బాగా తేరుకుంది. ఈ వెధవ ఒళ్ళో పొందికగా పడుకుని పాలు తాగుతూ, చెవి దుద్దు గట్టిగా లాగేశాడు. అది కాస్తా కుట్టు తెగింది. అప్పటి నుంచి ఆ దుద్దు వేలాడుతూనే ఉంటుంది అసహ్యంగా. కానీ, ఓ కుట్టు వేయించుకుందుకు ఆస్పత్రికి వెళ్ళడం పడనే లేదు. వీడి చదువుకి తాను కళ్ళలో వత్తులు వేసుకుని కూర్చునేది. చదివాడు. ఉద్యోగం వచ్చింది. పెళ్ళయి కోడలు వచ్చింది. మామగారు పోయినప్పుడు కోడలు చాలా బాధపడింది, ఒకటా రెండా అయిదు వేల పెన్షన్ ఇక రాదని. 'ఫరవాలేదోయ్ అమ్మకి ఫ్యామిలీ పెన్షన్ ఇస్తారు' అని భార్యకి ధైర్యం చెప్పడం విని తన చెవులను తానే నమ్మలేకపోయింది లక్ష్మి. 'సర్లే, చచ్చినాడి పెళ్ళికి వచ్చిందే కట్నం అన్నట్టు ఇదేనా వస్తోంది. నాకేదైనా వస్తే ఖర్చుకుంటుంది' అని సంతోషించడం నేర్చుకుంది లక్ష్మి. 'మొదటి సారిగా 'డబ్బు' తనకి రావడం ఎంతో అవసరం. దాని విలువ -రూపాయలు కాదు- 'తనని చూసుకోవడం'లో కనబడుతుంది' అని నిట్టూర్చింది. 'అదే లేకపోతే నా బతుకెలా సాగేదో ఊహించడం కూడా కష్టం. డబ్బు ధైర్యాన్నిస్తుంది. అది చేతికి రాకపోయినా ఫరవాలేదు. కాగితం మీద చూసినా చాలు' అనుకునేది.



చిత్రం: నర్సిం


"నానమ్మకి అద్దం పిచ్చి. అలా చూసుకుంటుందెందుకమ్మా?" నాని ప్రశ్న.

"అదో పిచ్చిలేరా. నిన్నెవరు చూడమన్నారు?" వాడి నోరు మూయిస్తుంది కోడలు.

నిజమే. తనకి అద్దం అందం చూసుకుందుకు కాదు. అది నా ముఖం చూపించడం మానేసి చాలా రోజులైంది. అది నా గత జీవితాన్ని చూపెడుతోంది. అదీ మసక మసకగా. జయంతికిది చెప్పాలి ఒక రోజు. ఆ ఆశ ఎప్పటికి తెల్లారేను. పదే పదే అనుకుంటూనే ఉంది లక్ష్మి. వినికిడి బాగా తగ్గిపోయినా, దృష్టి తగ్గిపోయినా చెప్పాలన్న ప్రయత్నం మటుకు లక్ష్మి మానసూ లేదు, ఆ కోరిక ఆమెకి తీరనూ లేదు. ఆశ్చర్యం. మనిషి బతికేస్తాడు. ఎలాగేనా బతికుంటాడు. శరీరానికి పటుత్వం తగ్గిపోయినా, పూర్తిగా అందరి మీదా ఆధారపడవలసినా, చావు చేతిలో లేదు కనుక బతకాలి తప్పదు. ఆ బతుక్కి విలువ గడ్డిపోచకున్నంత పాటి విలువ లేకపోయినా సరే.

'నాకెందుకు నా ముఖం కనబడదు? అద్దంలో నాకెందుకు నా గతం కనిపిస్తుంది? ఈ ముసలి ముఖంలో బాల్యపు చిలిపితనం, యౌవనపు మెరుగులు; భార్యగా, తల్లిగా మోసిన బరువులు. అలా ఎందుకు కనిపిస్తాయి? ఏ బాధ్యతా లేకుండా మారాం చేసి మరీ పనులు సాధించుకున్న లక్ష్మి, అందంగా ముద్ద బంతి పువ్వులా కనిపించే లక్ష్మి కనిపిస్తుంది. అలవోకగా సంసారంలోకి, లోతు ఊహించలేని అమాయకత్వంతో కలహంసలాగా జారిపోయింది. ఏదో తెలియని స్వర్గం దక్కుతుందన్న అత్యాశ ఆమెని ఎప్పటికప్పుడు ముందుకి తోస్తూనే ఉండేది. అబ్బాయి పుట్టినప్పుడు అంతా అందలం ఎక్కించారు. తన జీవితానికి పెళ్ళి ఒక కంచె వేస్తే, పిల్లాడు పుట్టి ఆ కంచెనింకా కుదించాడు. కానీ, అందరి ఆనందంలో తానూ ఆనందించింది. జీవితం హాయిగా సాగిపోతున్నంత సేపూ, 'ఆడదాని చలవ' అనేవాళ్ళే, కాస్త ఒడిదుడుకులు వస్తే 'ఆడదాని చలవే' అనేస్తారు! 'నేనెలా కారణం? ఇస్తే పుచ్చుకుని, పెడితే తినే ఆడదానికంత శక్తి ఎక్కడి నుండి వస్తుంది?' వింతపడేది లక్ష్మి.

హఠాత్తుగా మంచం పట్టకుండా భర్త పోవడం... ఆ సుఖమైన ముగింపు. అదే సుఖ మరణం. ఎంత అదృష్టం అని అంతా ఆహా, ఓహో అన్నారే. ఇక్కడ చచ్చి బతుకుతున్నందుకా? నాపై విలువ లేకుండా పోయింది. మగవాడెంత స్వార్థపరుడో! ఉన్నన్నాళ్ళూ తన సుఖం కోరుకుంటాడు. పోయేటప్పుడూ తన సుఖమే కోరుకుంటాడు. ఇది చాలా అన్యాయం అనుకునేది లక్ష్మి. ఎప్పుడేనా పలకరించ వచ్చే చుట్టాలు, పరిచయస్థులూ కూడా అలా అనుకోవడం దారుణంగా అనిపించేది. "అది కాదే లక్ష్మీ. మగవాడు పోయినా ఆడది ఎలాగో కాలం వెళ్ళతీయగలదే. అదే ఆడది పోతే మగవాడు బతకలేడు" అంటూ ఉండడం కోపం తెప్పించేది లక్ష్మికి. 'అంటే ఆడది ఏ అంట్లు తోమేనా బతికేస్తుందనా?



ఎవరేమన్నా ఇంత ముద్ద పడేస్తారన్న ఆశతో కాలం గడిపేస్తుందనా' అని అడగాలనిపించేది. కానీ, 'తెలిసిందిగా?' నవ్వుకునేది లక్ష్మి. 'ఆయన పోతే ఎలా?' అన్న భయం పోయి, 'ఎలాగో అలా' అన్న నిరాశ నుంచి... 'రోజులు తరుముకు వస్తున్నాయి కదా' అన్న ఆశతో బతికేయడం లేదూ!

> నా ముఖంలో అందం కోసం వెతుక్కోడం లేదే, నా కోసం వెతుక్కుంటు న్నాను' అని కోడలితో అనాలని లక్ష్మి కోరిక. కానీ సాహసించలేకపోయింది.

"నానీ ఒరే. అది తియ్యకురా." అరుస్తూ మంచం మీద లేచి కూర్చునేలోగానే నానిగాడు అద్దం కాస్తా చేతిలోంచి జార విడిచాడు. నేల మీద వెల్లకిలా పడింది అద్దం. వెల్లకిలా పడిన అద్దం కాస్తా ముదిమిన ముడుతలు పడిన ముఖంలాగా వింతగా పగుళ్ళు తీసింది. 'అయ్యో' అనుకుంటూ గబగబా లేచి దాన్ని రెండు చేతుల్లోకి తీసుకుంది లక్ష్మి. అసలే సగం సగం వెనక కళాయి పోయిన అద్దం. ముఖం అంతా కనిపించనే కనిపించదు. అలాంటిది కాస్తా ఇప్పుడు ముక్కలు ముక్కలుగా కనిపిస్తుందా? అసలేం కనబడదా? తీక్షణంగా తన ముఖం చూసుకుందుకు ప్రయత్నించింది లక్ష్మి. "అయ్యో ఏం కనిపించదేంరా నానీ. ఇలా రారా. నువ్వు చూసుకో కనిపిస్తుందేమో!" గట్టిగా అరిచింది లక్ష్మి. అలా చూసుకుంటూనే కూర్చుంది. ముక్కలు రాలిపడిపోని అద్దంలో ఆమెకి వింతలు కనిపిస్తున్నాయి. కుతూహలంగా చూసుకుంటూ తన చెంపలు మునివేళ్ళతో నిమురుకుంది. ఒక చేతి వేళ్ళకి పది చేతుల వేళ్ళు కదులుతున్నాయి. కానీ ఆశ్చర్యం. ముఖం కనిపిస్తోంది. ఏ ముక్కలో ఆ ముక్క. ఆ ముక్కలోనే పూర్తిగా ముఖం కనిపిస్తోంది. అయ్యో ముక్క ముక్కలోనూ పూర్ణ ముఖం. ఇదేమిటీ? వింతపడుతూ గొణుక్కోసాగింది లక్ష్మి.

గుమ్మంలో నిలబడి వింత చూస్తున్న కొడుక్కి, కోడలికి నవ్వొచ్చింది. "చూశారా ఇంత చిన్న విషయానికి కెంత నాటకం ఆడుతోందో మీ అమ్మగారు! మీదేముందండీ, హాయిగా ఆఫీసుకి చక్కా పోతారు. నానిగాడు స్కూలుకి చక్కా పోతాడు. నేను కదా రోజంతా ఈవిడతో పడేది" అంది నిష్ఠూరంగా.

"అమ్మా ఏమిటే ఇదీ?" రెండడుగులు గదిలోకి వేస్తూ అడిగాడు కొడుకు.

"అద్దం పగిలింది. అయినా పూర్తి ముఖం కనిపిస్తోంది. ఎన్ని ముఖాలు, ఎన్ని ముఖాలు చూడరా" అని అద్దం కొడుక్కి అందించబోయింది. పైకెత్తిన అద్దంలోని పెంకులు గలగలా నేలకి రాలాయి.

"చూశావురా, చూశావా? గచ్చుమీద గచ్చకాయలు పడ్డట్టు ఆ చప్పుడు. విన్నావురా!" ఏదేదో అడుగుతూ ఓ అద్దం ముక్క తీసుకుని ముఖం చూసుకోసాగింది.

"ఏమండీ, లాక్కోండీ. ఎక్కడ తెగి రక్తం కారుతుందో. అదో గొడవ." మొగుణ్ణి కసిరింది జయంతి.

"అమ్మా కింద పారెయ్. చేయి తెగుతుందే" అంటూ చేతిలోంచి లాక్కునే ప్రయత్నం చేశాడు.

"చూడరా ముక్కలో కూడా ముఖం కనిపిస్తోంది. అంటే, అంటే..." అని ఆగింది.

"అంటే నీకు పిచ్చెక్కిందని అర్థం. ఇలా తే" అంటూ అద్దం పెంకు లాక్కున్నాడు. భయంగా ముఖం చేతుల్లో దాచుకుంది లక్ష్మి. అద్దం లేకుండానే కొడుకు ముఖం వేయి ముక్కల్లాగా కనిపిస్తోంది ఆమెకి. కళ్ళు నులుముకొని మళ్ళీ మళ్ళీ చూసింది. కానీ, వాడి ముఖం ముక్కలుగానే కనిపిస్తోందామెకి. "ఇదేం ఖర్మండీ. తెల్లారితే కొత్త సంవత్సరం. ఈ పూట ఈవిడ టపా కట్టదు కదా?" భయంగా భర్తని అడిగింది.

తల్లి ముఖం ప్రశాంతంగా కనిపించింది కొడుక్కి. 'అదేదో జరిగితే ఇద్దరూ అదృష్టవంతులు కదా' అన్నాడు సగం స్వగతంగా. "అంటే? నా మూలాన్నే మీ అమ్మ?" ఆగిపోయింది జయంతి మాటరాక.

"అలా ఎందుకంటాను. ఆమె దురదృష్టవంతురాలు. లేకపోతే నాన్న పోయాక ఇన్నాళ్ళు బతికేది కాదు."


"అలా అంటారేమిటండీ! పెన్షన్ రాలేదా" అనేసి నాలుక కొరుక్కుంది జయంతి.

"నిజమే. అమ్మ కొత్త సంవత్సరానికి కానుక పెన్షన్ కట్ మనకి. ఆమెకి లాభం, మనకి నష్టం" అంటూ తల్లిని లేవదీయడానికి ప్రయత్నించాడు. కానీ, ఆమె అప్పటికే నేలకొరిగింది. 'నయం, పిచ్చెత్తి ప్రాణాలు తీసేది' అని గొణుక్కుంది జయంతి. పోవడం మంచిదైంది కదా! ■

# నంపత్‌కు శుభకామ్నా

## గ్రామీణాభివృద్ధిని, పర్యావరణ పరిరక్షణను కాంక్షించిన కథలు

■ మల్లంపల్లి ధూర్జటి



*లియోసా*
టి. సంపత్ కుమార్
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ అన్ని శాఖల్లో.
పేజీలు: 154.
వెల: రూ. 75/-

ఇది సంపత్ కుమార్ తొలి కథా సంపుటి. ఇందులో 12 కథలున్నాయి. వృత్తి రీత్యా పర్యావరణం, గ్రామీణాభివృద్ధి రంగాలకు సన్నిహితంగా మెలిగే సంపత్ కుమార్ సామాజిక బాధ్యతనెరిగి రాసిన కథలివి. ముఖ్యంగా గ్రామీణాభివృద్ధిపై పరిశోధనలు చేసినంత మాత్రాన ప్రయోజనం సిద్ధించదు. గ్రామీణులతో కలసిపోయి పథకాలను రూపొందించాలనే కథ *రించిన్*. "మనమంతా సొసైటీ నుంచి ఎంతో తీసుకొంటాం. కానీ, తిరిగి ఇవ్వడం దగ్గరే మనం పేచీ పడతాం. పేదవారి సమస్యలకు సమాధానాలు అందించడంలో ఉన్న తృప్తి ఎంతో అపురూపమైనది. ఫలితాల పరదాల్లోంచి వారి చిరునవ్వులు కనబడతాయి చూడు, అవే మన డిగ్రీలు కావాలి. గ్రామాలకు వెళతాం. సర్వేలు చేస్తాం. డిసర్టేషన్లు రాస్తాం. కానీ, ఎవరి జీవితాల గురించి రాస్తామో వారి జీవితాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరిగానే ఉండిపోతాయి. వారిపైనే ఇంకా పరిశోధనలు చేస్తాం. పత్రాలను సమర్పించి ప్రమోషన్లు పొందుతాం. విదేశాలూ చుట్టి మరీ వస్తాం. నాకెందుకో ఇది ఆత్మవంచనగా అనిపిస్తుంది" అని *రించిన్* కథలో రించిన్ తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది. రించిన్, వెంకూల మధ్య సాగిన ప్రణయంలో ఈ కథాంశాన్ని మిళితం చేయడంలో, కథకు మేఘాలయను ప్రధాన భూమిక చేసుకోవడంలో రచయిత నేర్పు చూపారు.

చైనాలో తియానన్మెన్ స్క్వేర్‌లో విద్యార్థులపై జరిగిన సైనిక చర్యలో తన ప్రియుడిని కోల్పోయిన లియోసాకు, భారతదేశం నుంచి వెళ్ళిన ఓ వ్యక్తికి మధ్య పెంపొందిన ఆత్మీయతానుబంధాన్ని అపురూపంగా చిత్రించిన కథ *లియోసా*. ఈ రెండింటి తరువాత చెప్పుకోతగ్గది కంబోడియా దేశ పరిస్థితిని వివరించే *అనగనగా ఒక దేశం కథ*. ఆ తరువాతి స్థానం *గిల్లేసిన రెమ్మలు* కథకి దక్కుతుంది. తీవ్ర వాదం అనేక మంది అమాయకుల ప్రాణాలను ఎలా బలిగొంటోందో ఈ కథలో చూడవచ్చు.

ప్లాస్టిక్, అల్యూమినియం వచ్చి కుమ్మరుల కడుపు కొట్టిన తీరును చివ్వ కథ చిత్రిస్తుంది. పత్రహరితం ప్రశ్నిస్తోంది, డాలర్ వర్సస్ మదర్ కథలు పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని రాసినవి. తమ సమస్యల్ని తామే పరిష్కరించుకోవాలని సూచించే కథ మట్టి. మనుషులను మతం దృష్టితో చూడడం మానాలని, భారత జాతికి మత సహనం ఒజ్జబంతి కావాలని కాంక్షించిన కథ పొగడరా నీతల్లి భూమి భారతిని. తెలుగుకు సమాధి కథ రానురాను తెలుగు భాష ఎలా చిక్కిపోతోందో వివరిస్తుంది. రచయితలు సామాజిక బాధ్యతను విస్మరించకూడదని చాటే కథ ఎడిటర్ పిలుపు. రించిన్, లియోసా పాత్రల సృష్టికర్తగా తెలుగు కథాభిమానులు ఆయనను చాలా కాలం పాటు గుర్తుంచుకుంటారు. ■